

జడ్చర్ల రైల్వే రేక్ పాయింట్‌కు వచ్చిన వ్యాగన్ నుంచి ఎరువులను లారీల్లోకి లోడ్ చేస్తున్న కూలీలు

# ఎరువుల్ ఫుల్

- వానకాలం సీజన్‌కు సరిపడా ఎరువులు
- సాగు అంచనాలకు అనుగుణంగా అందుబాటులో..
- రైతులకు ముందుగానే సిద్ధం చేసిన ప్రభుత్వం
- జడ్చర్ల రేక్ పాయింట్‌కు చేరిన 2,673.6 టన్నులు
- అన్ని ప్రాంతాల్లో తగినంతగా స్టాక్
- సీఎం కేసీఆర్ రైతుబాంధవుడంటున్న కర్షకులు

జడ్చర్ల, జూలై 3: ఈ ఏడాది వానకాలం పంటల సాగుకు సరిపడా ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. వానకాలంలో పలు రకాల పంటలను రైతులు సాగు చేస్తారు. అందుకు అవసరమైనన్ని ఎరువులను అధికారులు అంచనా వేసి గోదాంలలో నిలువ చేస్తున్నారు. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఎరువులకు డిమాండ్ ఉంటుంది. ముందస్తుగానే ఎరువులు కొనుగోలు చేస్తుండడంతో సదరు దుకాణాలు రైతులతో సందడిగా మారాయి. ఎరువుల కొరత ఉంటే వ్యవసాయ పనులతోపాటు సాగు ఆలస్యమై దిగుబడులు కూడా తగ్గుతాయి. అందుకోసమే వ్యవసాయశాఖ అధికారులు వానకాలంలో రైతులు సాగుచేసే పంటలకు సంబంధించి ముందస్తు ప్రణాళికలతో జిల్లాకు ఎంత మొత్తంలో ఎరువులు కావాలో ప్రణాళికలు సిద్ధం చేసి ఇప్పటికే నిల్వ చేశారు. సాగుచేసే పంటలను బట్టి నెలనెలా ఎరువుల అవసరాన్ని బట్టి అధికారుల లెక్కల ప్రకారం తెప్పించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది 53వేల మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుందనే ఉద్దేశంతో 63వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేసినట్లు జిల్లా వ్యవసాయాశాఖ అధికారి వెంకటేశ్ తెలిపారు. వానకాలానికి 63వేల మెట్రిక్ టన్నుల ఎరువులకుగానూ ప్రస్తుతం 43,290మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో యూరియా 12,258 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5,964మెట్రిక్ టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ)422 టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 578మెట్రిక్ టన్నులు, 24,069మెట్రిక్ టన్నులు వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు డీఏవో తెలిపారు. రైతుల అవసరం మేరకు ఎరువులు నెలనెలా వస్తూనే ఉంటాయని తెలిపారు.

### పెరుగనున్న పత్తి, వరి సాగు

జిల్లాలో వివిధ రకాల పంటలను దాదాపు 3.77లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, వరి, కంది పంటలు సాగు చేస్తారు. పత్తి గతేడాది వానకాలం లక్ష ఎకరాల్లో సాగుచేయగా ఈసారి 1.20లక్షల ఎకరాల్లో సాగు చేయనున్నారు. వరి గతేడాది 1.88లక్షల ఎకరాల్లో సాగు చేయగా ఈసారి 1.90లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. మొక్కజొన్న గతేడాది 25వేల ఎకరాల్లో సాగుచేయగా ఈ ఏడాది 28వేల ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉంది. అదేవిధంగా కంది గతేడాది 10వేల ఎకరాల్లో సాగు చేయగా ఈసారి 12,500 ఎకరాలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందుకు తగినంతగా ఎరువులను నిల్వ ఉంచుతున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకముందు నాటి ప్రభుత్వాలు రైతులకు సరిపడా ఎరువులు అందించలేకపోయాయి. ఎరువుల కోసం రైతులు దుకాణాల ముందు రోజులకొద్ది పడిగాపులు కాసేవారు. క్యూలో నిల్చొని సొమ్మసిల్లి కిందపడిపోయిన సంఘటనలు ఎన్నో. లైన్‌లో నిల్చున్నా.. ఎరువులు సరిపడక బ్లాక్‌లో కొనుగోలు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. కాని తెలంగాణ ఏర్పాటై బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ముందస్తుగానే అందుబాటులో ఉంచుతున్నది. సీజన్ రాకముందే ఎరువులను నిల్వచేస్తున్నది. సాగుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




జడ్చర్లలోని ఫర్టిలైజర్ దుకాణంలో ఉన్న ఎరువులు

### రేక్ పాయింట్‌కు 2,673.6టన్నుల ఎరువులు

జడ్చర్ల రేక్ పాయింట్‌కు సోమవారం గ్రోమోర్ కంపెనీకి చెందిన ఎరువుల వ్యాగన్ వచ్చింది. మొత్తం 2,673.6టన్నుల ఎరువులు రాగా అందులో డీఏపీ 1338.8టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1339.8టన్నులు వచ్చాయి. వారం రోజుల కిందట కూడా 2,369 మెట్రిక్ టన్నులు, ఆదివారం 740 మెట్రిక్ టన్నుల స్టాక్ వచ్చింది. రేక్ పాయింట్‌కు వచ్చిన ఎరువులను జిల్లాలోని వివిధ ప్రాంతాల ఫర్టిలైజర్ డీలర్లకు పంపించారు.

### అందుబాటులో ఉంచాం

వానకాలానికి సంబంధించి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సీజన్‌కు సంబంధించి అన్ని రకాల ఎరువులు నిల్వ ఉంచాం. అవసరాన్ని బట్టి జిల్లాకు ఎరువుల సరఫరా కొనసాగుతుంది. ప్రస్తుతం ఉన్న నిల్వలతో పాటు నెలనెలా ఎంత అవసరమో ఆ మేరకు ఎరువులు తెప్పిస్తాం. సోమవారం జడ్చర్ల రేక్ పాయింట్‌కు 2,673.6టన్నుల ఎరువులు వచ్చాయి.



- డీఏవో వెంకటేశ్

# 'పట్టా' పరవశం

- గేమ్యాతండాలో 83 కుటుంబాలకు 263.59 ఎకరాలకు హక్కు పత్రాలు
- గిరిజన రైతుల్లో పోడు సంబురం
- ఆనందంతో మహిళల నృత్యాలు

కొల్లాపూర్, జూలై 3: ఎన్నో దశాబ్దాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పోడు పట్టాలు అందజేయడంతో గిరిజనులు ఖుషీగా ఉన్నారు. కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం జీపీ పరిధిలోని గేమ్యాతండాలో 83 కుటుంబాలకు 263.59 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శనివారం అందజేశారు. దీంతో తండాలోని సగంమంది గిరిజన మహిళలు సోమవారం ఆనందంతో సాంప్రదాయ నృత్యం చేస్తూ పొంగిపోయారు. సర్కారు తమకు పోడు పట్టాలను ఇవ్వడంతో ఇక మీదట అటవీ అధికారుల నుంచి వేధింపులు ఉండవని, ధైర్యంగా సాగు చేసుకోవచ్చని సంతోషం వ్యక్తం చేశారు. 50 ఏండ్లకు పైగా తమ తండాకు సమీపంలో ఉన్న జాలోని కొత్తపల్లి, మేకగుండుతువ్వ అటవీ ప్రాంతంలో మూడువందల ఎకరాలకు పైగా భూమిని తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నామని తండాకు చెందిన లక్ష్మి, రుక్మిణి, అలివేలు, మంగమ్మ తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దమనస్సుతో మాపై దయ చూపి పట్టాలు పంపిణీ చేయడంతో సంతోషంగా ఉన్నామన్నారు. తమకు పోడు పట్టాలు ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే బీరం హ ర్షవర్ధన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని తండావాసులు పేర్కొన్నారు.

### ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్సైలు బదిలీ

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జూలై 3: ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని పలు పీఎస్‌లు, వీఆర్, ఎస్బీలకు బదిలీ చేయగా.. పలువురు ఎస్సైలకు పీఎస్‌లలో పోస్టింగ్ ఇవ్వలేదు.

| ఎస్సై | ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం | బదిలీ అయిన ప్రాంతం |
|---|---|---|
| కె.శ్రీనివాసులు | గద్వాల జిల్లా శాంతినగర్ పీఎస్ | మూసాపేట పిఎస్, పాలమూరు |
| పి.విజయ్‌భాస్కర్ | మూసాపేట పీఎస్, పాలమూరు | వీఆర్, పాలమూరు |
| ఆర్.శేఖర్ | గద్వాల జిల్లా, మల్దకల్ పీఎస్ | సీసీకుంట, పాలమూరు |
| వడ్డెమాన్ మోహన్‌బాబు | సీసీకుంట, పాలమూరు | వీఆర్, పాలమూరు |
| హృషికేశ్ పుడాత్ | వీఆర్, పాలమూరు | వీఆర్, గద్వాల |
| డి.సురేశ్ | వీఆర్, నారాయణపేట | మహ్మదాబాద్ పీఎస్, పాలమూరు |
| ఎన్.సైదయ్య | మహ్మదాబాద్ పీఎస్ | వీఆర్,పాలమూరు |
| పి.అశోక్‌బాబు | డీసీఆర్బీ, వనపర్తి | ఇటిక్యాల్ పీఎస్, జోగుళాంబ |
| ఎంఏ ఖాదర్ | వీఆర్, నారాయణపేట | వీఆర్ గద్వాల అటాచ్ టూ రాజోళి పీఎస్ |
| ఏ.నాగరాజు | డీఎస్బీ, పాలమూరు | వీఆర్, నారాయణపేట |
| బి.కృష్ణయ్య | సీసీఎస్, పాలమూరు | వీఆర్, నారాయణపేట |
| కొండూరు రాము | డీసీఆర్‌బీ, వనపర్తి | మానోపాడు పీఎస్, గద్వాల జిల్లా |



విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

# పేద విద్యార్థులకు ఊరట

### ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



ప్రస్తుతం ప్రభుత్వ బడులు సకల సౌకర్యాలతో మెరుగైన విద్యాబోధనకు నిలయంగా మారాయి. విద్యార్థుల తల్లిదండ్రులపై నోటుపుస్తకాల భారం పడకుండా ప్రభుత్వమే సరఫరా చేస్తున్నది. విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారంగా రాగిజావను కూడా అందిస్తున్నాము. ఉమ్మడి పెబ్బేరు మండలానికి 23వేల నోటుపుస్తకాలు అవసరముండగా ఇప్పటి వరకు 9వేల పుస్తకాలొచ్చాయి. మిగితావి రాగానే విద్యార్థులందరికీ పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తాం. - జయరాములు, ఎంఈవో, పెబ్బేరు

### ఉపయోగకరంగా ఉన్నాయి



ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంది. అన్ని సబ్జెక్టులకు నోట్స్‌లు ఇస్తామని చెప్పారు. దీంతో మాకు కొనే భారం తగ్గింది. బడుల్లో మధ్యాహ్న భోజనంతోపాటు తాజాగా ఇస్తున్న రాగిజావ కూడా ఎంతో బాగుంది. - నందిని, విద్యార్థిని, 9వ తరగతి

### ఖర్చు మిగిలింది



పదో తరగతిలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి నోటు పుస్తకాలు కొనాలంటే సుమారు రూ.900 దాకా ఖర్చు అవుతుంది. ప్రభుత్వం ఉచితంగా వీటిని ఇస్తుండడం వల్ల మా తల్లిదండ్రులకు ఆ భారం తప్పింది. విద్యాబోధన కూడా బాగుంది. - ప్రకాశ్, విద్యార్థి, 10 తరగతి

- విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు
- తొలిసారి సర్కారు స్కూళ్లల్లో పంపిణీ
- వనపర్తి జిల్లాకు 95 వేల నోటుపుస్తకాలు
- ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా..


పెబ్బేరు, జూలై 3 : పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు సకల వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందడుగు వేస్తున్నది. ఇప్పటికే ఉచితంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తుండగా.. తాజాగా నోటుపుస్తకాలను సైతం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది రాగిజావతోపాటు నోటుపుస్తకాల పంపిణీని ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. సర్కారు బడుల బలోపేతంతోపాటు పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని 2023-24 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ విద్యావిధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. మనఊరు-మనబడి కింద కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దడం, ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ తరగతుల నిర్వహణ వంటివి ఇందులో భాగమే. తాజాగా పాఠ్యపుస్తకాలతోపాటు నోటుపుస్తకాలను సైతం ఉచితంగా పంపిణీ చేయడంతో విద్యార్థులకు ఎంతో వెసులుబాటు కలుగుతున్నది. ఏటా ఒక్కో విద్యార్థి తల్లిదండ్రులు నోట్ పుస్తకాల కోసం రూ.400 నుంచి రూ.900 దాకా ఖర్చు చేసేవారు. ఇప్పుడు ఆ డబ్బు ఆదా అయినట్లయ్యింది.

### 6-10 తరగతుల విద్యార్థులకు..

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6-10 తరగతుల విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేసింది. 6-8 తరగతి విద్యార్థులకు 7 చొప్పున, 9, 10 విద్యార్థులకు 14 చొప్పున నోటుపుస్తకాలను అందజేస్తున్నది. 18* 29.5 సెంటీమీటర్ల సైజులో 200 పేజీలు ఉన్న నోటు పుస్తకాల్లో కొన్ని గీతలతో కూడినవి, మరికొన్ని తెల్లటి పేజీలవిగా విభజించింది. ఒక్కో విద్యార్థికి రెండు రకాల నోటు పుస్తకాలను అందిస్తారు. ఈ నోటుపుస్తకం ధర బహిరంగ మార్కెట్లో రూ.60 నుంచి రూ.65 దాకా ఉంటుంది. పుస్తకం కవర్ పేజీపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోతోపాటు మనఊరు-మనబడి, మనబస్తీ-మనబడి అంటూ 'ఎడ్యుకేషన్ ఫర్ ఆల్' అనే క్యాప్షన్ ఉంటుంది. చివరి పేజీ మీద విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫొటోతోపాటు సర్కారు బడుల ప్రగతి ఫొటోలు 'ఫెసిలిటీస్ ఇన్ తెలంగాణ గవర్నమెంట్' అనే క్యాప్షన్‌తో ముద్రించి ఉంటుంది.

### జిల్లాకు 2.37లక్షల పుస్తకాలు అవసరం..

జిల్లా మొత్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యను బట్టి 2లక్షల 37వేల పుస్తకాలు అవసరమని అధికారులు తేల్చారు. ఇప్పటివరకు గీతల నోటు పుస్తకాలు 40,361, ప్లేన్ నోటుపుస్తకాలు 54,750 మొత్తంగా 95,111 జిల్లాకు చేరాయి. వీటిలో 63వేల నోటుపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశారు. జిల్లాకేంద్రం నుంచి అన్ని మండలాలకు వీటిని సరఫరా చేయగా ఎంఈవోల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అప్పజెప్పారు. కాగా జిల్లాకు ఇంకా లక్షా 42వేల నోటుపుస్తకాలు రావాల్సి ఉంది.




నోటుపుస్తకం కవర్ పేజీ

# గిరి జనం మురిసే..

- పోడు భూముల కర్షకుల్లో సాగు సంబురం
- భూ హక్కు పత్రాలతో గిరిజన రైతుల సంతోషం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్
- అడవిబిడ్డల్లో వెల్లివిరిసిన ఆనందం
- పట్టాల రాకతో రైతుబంధు దరఖాస్తులు



రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకుంటున్న లింగాల మండలం ఆదివాసీ గిరిజనులు

*గిరిజనగూడేలు, తండాలకుపండుగొచ్చింది.ఇన్నాళ్లూ బిక్కుబిక్కుమంటూ బతికిన గిరిజనం అటవీ భూములకు హక్కులుకల్పించడంతో స్వేచ్ఛావాయువులుపీల్చుకుంటున్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు పోడు భూములకు చట్టబద్ధతకల్పించారు. అర్హులైనవారికి భూ పట్టాలు పంపిణీ చేశారు. దీంతో ఇక వారికి అటవీ అధికారుల భయం లేదు. పంటలు పాడు చేస్తారనే బెంగ అసలే లేదు. దశాబ్దాల కాలం నుంచి భయాందోళనలమధ్యపోడు చేసుకొనిబతుకుతున్నగిరిజనుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.* - అచ్చంపేట, జూలై 3

ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం పోడు భూములకు హక్కులు కల్పించి గిరిజనుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపారు. గిరిజనులు.. ఆదివాసీల దశాబ్దాల కల పోడు భూములకు అటవీ యజమాన్య హక్కులు కల్పించడంతో రైతుల సంబురానికి అవధుల్లేకుండా పోయాయి. తాతల కాలం నుంచి అటవీ సంపదపై ఆధారపడి బతుకుతున్న గిరిజనులకు భూమిపై హక్కులు కల్పించారు. ఏండ్ల తరబడి దున్నుకొని బతుకుతున్న ప్రతిసారి అటవీశాఖ అధికారుల నుంచి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. సాగుచేసే ప్రతిసారి ఫారెస్టోళ్లు వచ్చి సాగు చేయనీయకుండా అడ్డుపడేవారు. కొన్నిసార్లు అటవీ, పోడు రైతుల మధ్య అనేక ఘర్షణలు చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో పోడు రైతులపై కేసులు కూడా నమోదయ్యాయి. వీరిపై ఉన్న కేసులను ఎత్తేయాలని ముఖ్యమంత్రి ప్రకటించారు. పట్టాలు ఉన్న రైతులకు భూములపై ఎలాంటి హక్కులు ఉన్నాయో అలాంటి పూర్తిస్థాయి హక్కులను కూడా పోడు రైతులకు వర్తింపజేశారు. గూగుల్ మ్యాప్‌లో హక్కులు పెట్టి రైతులకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాసుపుస్తకాలు ఇచ్చారు. దీంతో గిరిజనులు, ఆదివాసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హక్కులు పొందిన రైతులు సంబురపడుతున్నారు.

### రైతుబంధుకు దరఖాస్తులు

పోడు భూములకు పట్టాలు పొందిన రైతులకు రైతుబంధు, రైతుబీమా వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం సూచించింది. దీంతో పట్టాలు పొందిన గిరిజన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు గడువు సోమవారంతో ముగిసింది. వ్యవసాయ అధికారులకు పోడు పట్టా, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌ను అందజేశారు. అందరూ రైతుల మాదిరిగానే పోడు కర్షకులకు రైతుబంధు, రైతుబీమా వర్తింపజేస్తున్నందున సీఎం కేసీఆర్‌ను గిరిజనులు ఆశీర్వదిస్తున్నారు. అచ్చంపేట, అమ్రాబాద్, పదర, లింగాల, చారకొండ, వంగూరు మండలాల్లో మొత్తం 1,164 మంది రైతులకు 3,006 ఎకరాలకు పట్టాలు పొందారు.

### అచ్చంపేట మండలంలో..

అక్కారంలో 11 మంది రైతులు, ఆంజనేయతండాలో 11 మంది, బండతండాలో ముగ్గురు, బక్కలింగాయపల్లిలో 8 మంది, ఘనపురంతండాలో ఒక్కరు, జోగ్యతండాలో ఇద్దరు, కిష్టతండాలో 9 మంది, బొమ్మన్‌పల్లిలో ఇద్దరు, పుల్‌దేవిబండ తండాలో ఒక్కరికి రాగా మొత్తం 48 మంది రైతులు పట్టాలు పొందారు.

### అమ్రాబాద్ మండలంలో

మండలంలోని 12 గ్రామాల్లో 436మంది పట్టాలు పొందారు. జంగంరెడ్డిపల్లిలో ఆరుగురు, బీకే లక్ష్మాపూర్‌లో 105మంది, బీకే లక్ష్మాపూర్‌తండాలో 143మంది, మాచారంలో ఒక్కరికి, ఫరహాబాద్‌లో నలుగురు, ఫరహాబాద్‌పెంటలో ఇద్దరికి, మల్లాపూర్‌లో నలుగురు, కుడిచింతలబైలులో 15 మంది, సార్లపల్లిలో 51మంది, బీకే తిర్మలాపూర్‌లో ఏడుగురు, బీకే ఉప్పునుంతలలో 56మంది, వటువర్లపల్లిలో 42మంది పట్టాలు పొందారు.

### పదర మండలంలో..

మండలంలోని 13 గ్రామాలలో 411మంది రైతులు పట్టాలు పొందారు. అందులో చెన్నంపల్లి గ్రామంలో 96మంది రైతులు, చిట్లంకుంట గ్రామంలో 144మంది రైతులు, పెట్రాల్‌చేనులో 31మంది, గానుగపెంటలో 24మంది, పల్లెరూటుపెంటలో 32మంది, ఇప్పలపల్లిలో 18మంది, మద్దిమడుగులో 25మంది, బాపన్‌పాడులో 13మంది, మారెడుగులో నలుగురు, కోడొనిపల్లిలో ఒక్కరు, పదరలో ముగ్గురు, ఉడిమిళ్లలో 17మంది, వంకేశ్వరంలో ముగ్గురు రైతులు పట్టాలు పొందారు.

### లింగాల మండలంలో..

మండలంలోని 18 గ్రామాల్లో 248 మంది రైతులు పోడు పట్టాలు పొందారు. అందులో అప్పాయిపల్లిలో ఏడుగురు, అగర్లపెంటలో ముగ్గురు, అప్పాపూర్‌పెంటలో 14 మంది, రాంపూర్‌పెంటలో ముగ్గురు, భౌరాపూర్‌లో 11 మంది, ఈర్లపెంటలో 19 మంది, మోడిమొల్కలలో 29 మంది, రాంపూర్‌లో ఏడుగురు, సంగడిగుండాలలో 10 మంది, పుల్లాయిపల్లిలో నలుగురు, చెన్నంపల్లిలో ఐదుగురు, లింగాలలో ఒక్కరు, డీసీతండాలో ఇద్దరు, ఎంసీతండాలో ముగ్గురు, రాయవరంలో 131 మంది, వడ్డేరాయవరం ఐదుగురు, శ్రీరంగాపూర్‌లో ఒక్కరు, ఎర్రపెంట ఐదుగురు పట్టాలు పొందారు. రాయవరంలో కొన్ని పట్టాలు పంపిణీ జరగాల్సి ఉన్నది.

### చారగొండ మండలంలో..

మండలంలోని రెండు గ్రామాల్లో 14 మంది రైతులు పట్టాలు పొందారు. అందులో చారగొండలో 12 మంది, సిర్సనగండలో ఇద్దరు, వంగూర్ మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో ఇద్దరు రైతులు పోడు పట్టాలు పొందారు. నియోజకవర్గంలో 1,075 మందికి పోడు పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పొందిన రైతుల కండ్లల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. గత ప్రభుత్వాలు భూములకు పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేశాయని, సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్న..

మాది అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ గ్రామం. తాతల కాలం నుంచి సెల్క చేసుకొని బతుకుతున్నాం. ప్రతిసారి ఫారెస్టోళ్లు వచ్చి సతాయించేటోళ్లు. పట్టాబుక్కు లేక రైతుబంధు, రైతుబీమా వస్తలేదు. మావోళ్లకు అందరికీ వస్తుంది. మేము చాలా ఇబ్బంది పడినం. ఇప్పుడు పట్టా రావడంతో సంతోషంగా ఉంది. రైతుబంధు కోసం దరఖాస్తు కూడా చేసి సారోళ్లకు ఇచ్చినం. అందరిలాగే మాకు కూడా రైతుబంధు వస్తుందంట. సీఎం కేసీఆర్ సార్ సల్లగుండాలి. ఇప్పుడు ఎవరికీ భయపడకుండా సంతోషంగా వ్యవసాయం చేసుకొని బతుకుతం.



- సోనా, లక్ష్మాపూర్